క్లుప్తంగా

దివ్యాంగ చిన్నారులకు ఉపకరణాలు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర సమగ్ర శిక్ష, అలింకో వారి ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు అవసరమైన ఉపకరణాలను అందించేందుకు ఈ నెల 27వ తేదీన కొత్తగూడెంలో నిర్ధారణ పరీక్ష చేయనున్నట్లు స్థానిక ఎంఈవో కీసర లక్ష్మి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ..అశ్వారావుపేట మండలంలోని అన్ని పాఠశాలల పరిధిలో ఉండే దివ్యాంగ చిన్నారులకు అవసరమైన వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, చంక కర్రలు, ట్రైసైకిల్, రోలేటర్స్, బ్రెయిలీ కిట్‌లను అందిస్తారని అవసరమైన దివ్యాంగ చిన్నారులు, సంరక్షకులతో హాజరు కావాలని కోరారు. వివరాల కోసం ఐఈఆర్‌పీ ఫోన్ నంబర్లు 82470 06269, 96032 08851 సంప్రదించాలని ఎంఈఓ సూచించారు.

చెక్కు అందజేత

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన గుండెపూడి శ్రీనివాసరావుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చిన చెక్కును బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణలు గురువారం అందజేశారు. గత ఏడాది బ్రెయిన్ స్ట్రోక్‌కు చికిత్స చేయించుకున్న శ్రీనివాసరావుకు వైద్య ఖర్చులకు రూ. 27 వేలు చెక్కు అందింది. కార్యక్రమంలో ఆకోజు సునీల్ కుమార్, చిట్టిమల్ల అనిల్, తూటిక ప్రకాష్ పాల్గొన్నారు.

వైద్యసేవలు మెరుగుపరచాలి

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యసేవలను మరింతగా మెరుగుపరచాలని యువజన కాంగ్రెస్ నాయకులు ఆస్పత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావును కోరారు. ముందుగా బాధ్యతలు చేపట్టిన ముక్కంటేశ్వరరావును సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను భర్తీ చేయాలని, మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భజన సతీష్‌కుమార్, భజన ప్రసాద్, యడమకంటి సుధాకర్‌రెడ్డి, శనగ కిశోర్, చిర్రా నాని, భద్ర, నరేష్, ప్రతాప్, రాజు, వాసు పాల్గొన్నారు.

12న మహాసభలు

చర్ల: ఈ నెల 12న జరిగే ఏఐటీయూసీ మండల మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరి వెంకటేశ్వరావు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు నూపా పోతయ్య, సాయిల తిరుపతి, నాగేశ్వరరావు, అనీల్‌కుమార్, నాగేంద్ర, రాము, రాజు పాల్గొన్నారు.

దుష్ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు

ములకలపల్లి: ములకలపల్లికి చెందిన ఓ యువజన సంఘం నేత అకారణంగా తమ పాఠశాలపై దుష్ప్రచారానికి పాల్పడుతున్నాడంటూ ములకలపల్లి కేజీబీవీ ఎస్ఓ సక్కుభాయి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 12న కలెక్టర్ తమ పాఠశాలను తనిఖీ చేయగా.. సమస్యలను విన్నవించడంతో నిధులు మంజూరు చేస్తామని చెప్పినట్లు తెలిపారు. అయితే, సదరు యువజన సంఘం నాయకుడు తమ పాఠశాలలో సమస్యలు ఉన్నాయంటూ మీడియాలో ప్రచారానికి తెరలేపడమే కాక వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలను వాట్సప్ ద్వారా పంపిస్తూ మానసికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యార్థికి సన్మానం

అశ్వాపురం: రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీల్లో బంగారు పతకం సాధించిన అశ్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి అఫ్రిన్‌ను గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ శేషుబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీ సిబ్బందికి..

కరకగూడెం: స్థానిక పీహెచ్‌సీలో హెచ్ఈఓగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న గొంది వెంకటేశ్వర్లుతో పాటు హెచ్‌వీ భద్రమ్మ, ఎంపీహెచ్‌ఏ నాగారత్నంలను గురువారం శాలువాలతో సన్మానించారు. కరకగూడెం, పినపాక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు కారం మధు, దుర్గాభవాని, హెచ్ఈఓ పోలబోయిన కృష్ణయ్య వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీఎస్పీ నివాళి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జగదీష్ కాలనీకి చెందిన కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు సున్నం లక్ష్మయ్య అకాల మృతికి గోండ్వానా సంక్షేమ పరిషత్ సంతాపం ప్రకటించింది. జీఎస్పీ ఉమ్మడి రాష్ట్రాల కన్వీనర్లు సోందె వీరయ్య, పాయం సత్యనారాయణలు గురువారం లక్ష్మయ్య పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు అర్పించారు.

సమస్యలు పరిష్కరించాలి

ములకలపల్లి: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా బృందం ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెంలోని విద్యాశాఖ సూపరింటెండెంట్ సురేశ్ వినతిపత్రం అందజేశారు. సంఘ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరి వర్మా అజిత్, ఉపాధ్యక్షుడు వంశీరాజ్, పవన్‌కల్యాణ్ తదితరులు ఉన్నారు.

ఆదివాసీల జీవన పోరాటం

- కనీస సౌకర్యాలకు నోచుకోని గూడెంలు
- కలగానే విద్యుత్, రోడ్లు, తాగునీరు
- ఆపై అనారోగ్య సమస్యలతో సతమతం
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


చెలిమలో నీరు తోడుకుంటున్న ఆదివాసీలు (ఫైల్)

కరకగూడెం: దట్టమైన అడవుల్లో పోడు సాగే జీవనంగా బతుకుతున్న ఆదివాసీలకు సౌకర్యాలు కల్పించడం.. వారి జీవన స్థితిగతుల్లో మార్పు తీసుకురావడంపై ఎవరూ చొరవ తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఏళ్లుగా తాగునీరు, విద్యుత్ సౌకర్యాలే కాక రహదారులు అందుబాటులోకి రాకపోవడంతో దుర్భర జీవనం సాగిస్తున్నారు. పొరుగు రాష్ట్రం ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చి తొలినాళ్లలో వేట ఆధారంగా.. ఇప్పుడు పోడు సాగుతో బతుకుతున్న వీరి జీవితాల్లో ఎప్పటికీ వెలుగులు నిండుతాయో తెలియడం లేదు. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీ గూడెంల్లో సమస్యలపై కథనం.

ఐటీడీఏ ఉన్నా..

1975 మార్చి 12న ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటైంది. ఆతర్వాత 1971లో పాల్వంచకు, 1990 ఫిబ్రవరి 9నుంచి భద్రాచలం కేంద్రంగా ఐటీడీఏ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఐటీడీఏ ద్వారానే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పలు పథకాలను అమలుచేస్తున్నా ఆదివాసీ గిరిజనుల జీవితాల్లో చెప్పుకోదగిన మార్పులేవీ రాలేదు. నేటికీ మారుమూల ఆదివాసీ గిరిజన గూడాలకు సరైన రోడ్డు మార్గం లేక అత్యవసర సమయంలో ప్రాణాలు చేతులో పెట్టుకుని ఆస్పత్రులకు పరుగు తీయాఅల్సి వస్తోంది. ఇక వానాకాలం వచ్చిందంటే ఆదివాసీ గ్రామాలకు రవాణా పూర్తిగానిలిచిపోతుంది. ఈ సమయాన ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వరద దాటే మార్గం లేక దేవుడిపైనే భారం వేసి కాలం గడుపుతారు. ముఖ్యంగా ఆదివాసీ మహిళలను రక్తహీనత సమస్య వెంటాడుతోంది. అంతేకాకుండా మహిళలకు ప్రసవమంటే పునర్జన్మగా మారింది. వీటికి తోడు వేసవిలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదురవుతోంది. దీంతో సుదూర ప్రాంతాల్లో చెలిమలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. అంతేకాక విద్యుత్ సౌకర్యం లేక బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తుండగా.. పాఠశాలలు లేక పిల్లలు చదువుకు దూరమవుతున్నారు.

అడవి తల్లి ఒడిలోనే..

అడవే జీవనాధారంగా వలస ఆదివాసీలు ముందుకు సాగుతున్నారు. అటవీ ఉత్పత్తులను సేకరించి సమీప సంతలు, జీసీసీకి అమ్ముకుంటారు. అంతేకాక కర్రలతో బుట్టలు, తడికలు తయారు చేసి విక్రయిస్తుంటారు. భూమి పోడు కొట్టి వరి, మొక్కజొన్న, పత్తి వంటి పంటలతో పాటు కూరగాయలను సాగు సాగు చేస్తుంటారు. అంతేకాక ప్రకృతిలో కాలానికి అనుగుణంగా ఇచ్చే మార్పుల ఆధారంగా సంప్రదాయ రీతిలో వండుగలు నిర్వహించుకుంటారు. ఇకనైనా పాలకులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదివాసీల కోరుతుండగా.. ఎన్నటికీ వీరి మొర ఆలకిస్తారో వేచి చూడాలి.

సౌకర్యాలు కల్పించాలి



మా గ్రామంలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నాం. సరైన రోడ్డు లేక బయటి ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నాం. వర్షాకాలంలో ఆపద ఎదురైతే నరకం అనుభవించాల్సిందే. ప్రభుత్వాలు మారుతున్న మా బతుకుల్లో మార్పు రావడం లేదు. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించాలి.

– సోమిడి పద్మ, నీలాద్రిపేట

విద్యుత్ అందించాలి



వలస ఆదివాసీ గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేక రాత్రి ఇబ్బంది పడుతున్నాం. ఎటు వైపు ఆపద వస్తుందో తెలియక బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. గ్రామంలో ఇదివరకు ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ పరికరాలు కొన్ని మూలనపడ్డాయి. వీటిని మరమ్మతు చేయించి వెలుగులు పంచాలి.

– సోడె మాదారాం, నీలాద్రిపేట

గ్రామాల అభివృద్ధిపై దృష్టి


కరకగూడెం: రోడ్డుపై ఉన్న గుంతల కొలతలు నమోదు చేస్తున్న డీఎల్పీఓ సుధీర్ కుమార్

కరకగూడెం: గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక సారించినట్లు భద్రాచలం డీఎల్పీఓ సుధీర్ కుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఆయన విస్తృతంగా పర్యటించారు. గ్రామాల్లోని ప్రధాన రహదారిపై గల గుంతలను గుర్తించి మరమ్మతులు చేయడానికి కొలతలు తీసుకున్నారు.అలాగే 'స్వచ్ఛదనం-పచ్చదనం'లో భాగంగా కరకగూడెం జెడ్పీ పాఠశాలలో ఇంకుడు గుంతకు శంకుస్థాపన చేశారు. అనంతరం తాటిగూడెం గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖాధికారులతో కలసి నీరు నిలిచిన ప్రదేశాలలో గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్లపై దమ్ము చక్రాలతో తిరుగుతున్న ట్రాక్టర్లను ఉపేక్షించవద్దని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో హెచ్ఈఓ గొంది వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దేవ వర కుమార్, కరకగూడెం ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారి కారం మధు, పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు(శుక్రవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు ఓ ప్రకటనతో తెలిపారు. అశ్వారావుపేట 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని పేరాయిగూడెం 11 కేవీ ఫీడర్‌లో విద్యుత్ లైన్ మరమ్మతులు కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేపు దివ్యాంగులకు బస్‌పాస్‌ల మేళా

చంద్రుగొండ: ఈ నెల 10వ తేదీన చంద్రుగొండలోని బస్టాండ్ వద్ద దివ్యాంగులకు బస్‌పాస్‌ల మేళా ఏర్పాటు చేసినట్లు కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ మలగం దేవేందర్‌గౌడ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అర్హులైన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డుతోపాటు రెండు పాస్‌పోర్టు ఫొటోలు, రూ.50లు తీసుకుని రావాలన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఈ పాస్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బస్సు బుక్ చేస్తే రాయితీ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి విహార యాత్రలకు, శుభకార్యాలకు బస్సులను బుక్ చేసుకున్న వారికి 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ తిరుపతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ సంస్థ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

అధికారులకు శుభాకాంక్షలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అశోక్‌కుమార్‌ను, ఎస్సై వెంకటప్పయ్యను మాజీ జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. అధికారులకు పుష్పగుచ్ఛం అందజేసి స్వీట్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట నాయకులు మట్టా శివాజీ, కెల్లా శేఖర్, కొమ్ము రంజిత్‌కుమార్, శ్రీధర్, యంబడి అర్జునరావు, వెంకన్నరాజు, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుర్రాల చెరువు గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతూ.. స్థానికులు కార్యదర్శి స్వరూపకు గురువారం వినతిపత్రం అందించారు. డ్రెయినేజీ పూడుకుపోయిందని, దోమల నివారణా చర్యలు చేపట్టడం లేదని వారు పేర్కొన్నారు. వినతి పత్రాన్ని అందించిన వారిలో టి.సుబ్బారావు, ఎస్.వెంకన్నబాబు, ఎం.రఘు, ఎస్.చంద్రారావు, బాలాజీ, కె.రాజు, కె.సురేష్, కె.మంగరాజు, వై.రామకృష్ణ, ఎస్.రాము, కె.చందు ఉన్నారు.

నిర్మాణం పూర్తి చేయాలి

ములకలపల్లి: కమలాపురం శివారులో చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మండల నాయకుడు నకిరకంటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పార్టీ మండలకమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. పెద్దయ్యచెరువు అలుగు ప్రవాహంతో డైవర్షన్ రోడ్డుపై వరద ప్రవహిస్తోందని, దీంతో కమలాపురం గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు. వెంటనే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. పీవైఎల్ నాయకులు సవళ్ల శివ, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి

దుమ్ముగూడెం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పర్ణశాల డాక్టర్ రేణుకారెడ్డి సూచించారు. గురువారం పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పర్ణశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సీజనల్ వ్యాధులు.. వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రేణుకారెడ్డి.. యాంటీ లార్వా ఆపరేషన్ గురించి.. లార్వా ఎలా ఉంటుంది.. దోమ లార్వా ఎలా ఉంటుందో విద్యార్థులకు చూపించారు. హైస్కూల్ హెచ్‌ఎం సున్నం సమ్మయ్య, ఏజే.ప్రభాకర్, పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్, వైద్య సిబ్బంది నాగేశ్వరరావు, వెంకట నరసమ్మ,అమ్మాజి,సావిత్రి, నరసమ్మ, సబ్ సెంటర్ పర్ణశాల ఆశా వర్కర్‌లు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

నార్కోటిక్ డాగ్‌తో తనిఖీలు


అనుమానిత ఇంటి ఆవరణలో తనిఖీలు చేస్తున్న పోలీస్ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మత్తుపదార్థాలను గుర్తించేందుకు నార్కోటిక్ డాగ్‌తో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశారు. గురువారం అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్, బస్టాండ్ పరిసరాలు, ప్రయాణికుల బ్యాగులతోపాటు ఆర్టీసీ బస్సులు, దాబాలు, హోటళ్లు, పాన్ దుకాణాలు, అదే విధంగా అనుమానిత ప్రాంతాలు, అనుమానిత ఇళ్లలో గంజాయి, నార్కోటిక్ డ్రగ్స్ రవాణా, విక్రయాలు, వినియోగంపై డాగ్ సాయంతో పోలీసులు ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై శివరామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ.. మత్తుపదార్థాలకు సంబంధించిన వినియోగం, విక్రయాలు, రవాణా గురించి ఏలాంటి సమాచారం తెలిసినా స్థానిక పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అందరూ భాగస్వాములు కావాలి

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, రాజీవ్‌గాంధీనగర్ ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ బాలుర, లంక మల్లారం టీటీడబ్ల్యూఆర్‌జేసీ పాఠశాలలు, హాస్టళ్లల్లో హెల్త్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ శ్రీనివాసరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్‌లు మాట్లాడారు. పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటారు. అనంతరం నీటి నిల్వలలో గంభూషియా చేపలు వేశారు. కార్యక్రమంలో పి.వెంకటేశ్వరావు, వైద్యసిబ్బంది, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏళ్ల తరబడి డ్రెయినేజీ సమస్య


డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక ఇళ్ల వద్దకు చేరిన నీరు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో అల్లూరి సీతారామరాజు కాలనీలో ప్రతి ఏటా వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో నీరు నిలిచిపోయి ఇళ్లకు ముంచెత్తుతున్నాయి. సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని, ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని సదరు కాలనీ వాసులు తమ గోడును వెల్లబుచ్చుతున్నారు. దీనివల్ల కాలనీలోని దాదాపు 30 ఇళ్లలోని వారు ప్రతియేటా సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏఎస్ఆర్ కాలనీలో సరైన డ్రెయినేజీ వ్యవస్థను నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

గంబూషియా చేపలు విడుదల


చర్ల: నీటి గుంతల్లో గంబూషియా చేపలను వదులుతున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం భద్రాచలం పట్టణంలోని సుభాష్ నగర్ కాలనీలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దోమల నియంత్రణకు నీరునిల్వ ఉన్న కుంటలతో పాటు ఖాళీ స్థావరాలలో గంబూషియా చేపలను విడుదల చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం మండల వైద్యాధికారి సుభాష్ మాట్లాడుతూ.. నీటిలో అభివృద్ధి చెందుతున్న దోమలను గంబూషియా చేపలు కట్టడి చేస్తాయని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అశోక్ కుమార్, ఆశ వర్కర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చర్ల: మండల కేంద్రంలోని పలు ప్రాంతాలలో గురువారం మురుగునీటి గుంతల్లో గంబూషియా చేపలను విడిచిపెట్టారు. చర్లలోని పాత చర్ల, బస్టాండ్ సెంటర్, సాలెబజార్ తదితర ప్రాంతాలలో ఉన్న మురుగునీటి గుంతల్లో ఎంపీడీఓ ఈదయ్య, వైద్యాధికారి డాక్టర్ శ్రీధర్, పంచాయతీ అధికారులు, సిబ్బంది వీటిని విడుదల చేశారు.

బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూషియా చేపలను వదిలారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో గంబూషియా చేపలు వదలటం వల్ల దోమలను నివారించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసాహితి అన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో న్యాయవాదుల నిరసన


మణుగూరురూరల్: నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

మణుగూరురూరల్: జనగామలో న్యాయవాద దంపతులపై దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తూ విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిర్ర రవికుమార్ మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన పోలీసులను తక్షణమే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయవాద రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దాసరి కవిత, న్యాయవాదులు మేడరమెట్ల శ్రీనివాసరావు, నగేష్, పోశం భాస్కర్, సంధ్య, రుద్ర వెంకట్, రమేష్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

దాడిపై ఖండన

దమ్మపేట: న్యాయవాదులపై జనగాం పోలీసులు చేసిన దాడిని, దమ్మపేట కోర్టు బార్ అసోసియేషన్ తరపున తీవ్రంగా ఖండించారు. గురువారం దమ్మపేట కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయవాదులు మాట్లాడుతూ.. దాడికి నిరసన వ్యక్తం చేస్తూ, గురువారం నుండి రెండు రోజుల పాటు విధులను బహిష్కరించనున్నట్టుగా తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారం సతీష్‌కుమార్, లక్కినేని నరేంద్రబాబు, గొంది మురళీ, వెంకటరమణ, బాలరాజు, అప్పారావు పాల్గొన్నారు.

హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీ

మణుగూరుటౌన్: మండలంలోని ఎస్సీ, ఎస్టీ బాయ్స్ హాస్టల్‌ను ఎంపీడీఓ తహసీల్దార్, ఎంఈఓ బృందం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాల గురించి హాస్టల్ వార్డెన్ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వానాకాలం దృష్ట్యా బ్లీచింగ్ చేపించడంతో పాటు పిచ్చి చెట్లు తొలిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రాఘవరెడ్డి, మండల విద్యాశాఖాధికారి వీరస్వామి, మెడికల్ ఆఫీసర్ తదితరులు ఉన్నారు.

పింఛన్, రేషన్‌కార్డులు ఇవ్వాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

మణుగూరుటౌన్: సింగరేణిలో విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన, స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన అర్హులైన కార్మిక కుటుంబాలకు రేషన్‌కార్డులు, ప్రభుత్వ పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల, పట్టణ కార్యదర్శి జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్‌లు మాట్లాడుతూ.. సింగరేణి నుంచి రిటైర్డ్‌కార్మికులు వచ్చే పింఛన్ చాలక డ్రైవర్లు, క్లీనర్లుగా, వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారని, మానవతా ధృక్పథంతో ప్రభుత్వ పరమైన పింఛన్, రేషన్‌కార్డులు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, సర్వర్, కొత్తపల్లి సీతారాములు, సంపత్, రంగు ఆంజనేయులు గంగపేరి నారాయణ, కనకయ్య, గౌసుద్దీన్, ఆదర్ల రాములు, భీమా, రాములు, ఇక్బాల్, సోమయ్య ఉన్నారు.

రోడ్లపై నాట్లు వేసి నిరసన

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని తిప్పనపల్లి వాగు వద్ద ఉన్న కేసీఆర్‌కాలనీవాసులు అంతర్గతంగా ఉన్న రోడ్లపై గురువారం నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. రోడ్ల దుస్థితిని ఎన్ని మార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరారు.

సింగరేణి వైద్యశిబిరం

మణుగూరుటౌన్: సింగరేణి సేవా సమితి, వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో మణుగూరు మండల పంచాయతీ పరిధిలోని పునరావాస గ్రామమైన కొత్త కొమ్ముగూడెంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 85 మంది రోగులకు బీపీ, షుగర్, ఇతర వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యులు ఇన్నయ్య మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత, కాచి చల్లార్చిన నీరు సేవనం వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం సింగరేణి ఆధ్వర్యంలో అన్ని వీధుల్లో దోమల మందు పిచికారీతో పాటు బ్లీచింగ్ చేపట్టారు. కార్యక్రమంలో సిబ్బంది రూప, నందిని, మారేశ్వరరావు, యూసఫ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో..

దమ్మపేట: మండల పరిధిలోని గండుగులపల్లి ఏకలవ్య పాఠశాల, గొల్లగూడెం, అంకంపాలెం, పార్కలగండి ఆశ్రమ పాఠశాలల్లో పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరాల్లో ప్రభుత్వ వైద్యుడు దివాకర్ అనారోగ్య సమస్యలపై పరీక్షలు చేసి తగిన మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. ఏఎన్ఎం, స్టాఫ్ నర్స్, ఆశాలు పాల్గొన్నారు.

పొంగిన వాగు..

చంద్రుగొండ: మండలంలోని సీతాయిగూడెం-చంద్రుగొండ మధ్య ఉన్న ఎదుళ్లవాగు గురువారం పొంగి ప్రవహించింది. దీంతో మండల కేంద్రానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎంపీడీఓ బయ్యారపు అశోక్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. పోలీస్‌బందు బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోకలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఇదిలాఉండగా మండలంలోని అనేక గ్రామాల్లో పంటపొలాలు ఇంక నీటిలోని మునిగి ఉన్నాయి.

భక్తులకు అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మండలానికి చెందిన ఇరుగు భారతి, వారి కుమారుడు నవీన్, కుమార్తెలు పద్మ-రాజు దంపతులు, నేహా సాహితి, లోహిత, ఈనిముల నవ్య-ప్రశాంత్ దంపతులు ఆలయంలోని సాయిబాబాను దర్శించుకుని పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అన్నదాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్ సేవలను వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి

దమ్మపేట: గ్రామీణ ప్రాంతాల్లో పోస్టాఫీస్ ద్వారా అందిస్తున్న పొదుపు, ప్రమాద బీమా తదితర సేవలను వినియోగించుకోవాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి కోరారు. గురువారం మండలంలోని మల్కారం గ్రామ పంచాయతీ కార్యాయంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ పోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. పోస్టాఫీస్‌లోని పొదుపు, ఫిక్స్‌డ్ డిపాజిట్, ప్రమాద బీమా, మహిళా సమ్మాన్ వంటి పథకాలు ప్రజల ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేస్తున్నాయని అన్నారు. సమావేశంలో పాల్వంచ ఎస్‌డీఐపీ రమేష్ నాయక్, ఎస్‌పీఎం దేవకుమారి, పంచాయతీ కార్యదర్శి శివ, నాయకులు అంకత ఉమమహేశ్వరరావు, బుద్దే కోటేశ్వరరావు, శ్రీరాముల ప్రసాద్, ఉద్యోగులు శేషు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.